కథా నిలయం
5892
శ్రీకాకుళం

# గోగ్రా

క్యూ దేశపు కుర్చీలో కూర్చున్న శివదాసుని గోళ గ్రామ పెత్తందారులు పిలిచారు. వారిలో గోళ వ్యాపారులు (గోవాలు) గంభీరంగా, మౌనంగా పర్యవేక్షణ చేస్తున్నారు. గోళ రాజకీయోపజీవులు (గోరాలు) శివదాసుని నఖశిఖ పర్యంతం పరిశీలించారు.

ఒంటినిండా బూడిద. కళ్ళనిండా ఆవేశం. చేతిలో త్రిశూలం. నోటిలో శివనామం. జడలు కట్టిన జుట్టు. నోరు విప్పితే పద్యం. పద్యం నిండా అఖండ శివస్థాన్ స్వప్నాలు. పొంగి పొరలే విష్ణుస్థాన్ మీద ద్వేషం. కొబ్బరి కాయ మంచి చెడ్డలను మొట్టి చూసినట్టు తలకాయని మొట్టితే లోపల ఉన్నదంతా డొల్లేనని తెలిసింది.

వారూ, వీరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుని ఫరవాలేదు అనుకున్నారు.

"నాయనా శివదాసూ! కుర్చీలో కూర్చున్నావు. అభినందనలు. కూర్చున్నాక ఏం చేద్దామనుకుంటున్నావో చెప్పుమీ" అని గోముగా అడిగారు.

"ఎవరు మాత్రం ఏం అనుకుంటారు – కూర్చుండి పోదామనుకుంటారు."

"శహబాష్! ఆ మీదట ఏం చేద్దామనుకుంటున్నారు?"

"గుడి కడదామనుకుంటున్నాను."

"అదికాక నీ ఎజెండా ఏంటి?"

శివదాసు అట్టలు కట్టిన బుర్ర గోక్కున్నాడు.

"శహబాష్! జనానికి కూడు పెట్టాలనీ, గుడ్డ కట్టాలనీ అనుకుంటున్నావా?"

"ఛఛ! అవన్నీ ఆ శివుడు చూసుకుంటాడు. శివుని ఆన లేకుండా చీమయినా కుట్టదు. నారు పోసిన శివుడే నీరు పోస్తాడు. ప్రతీ మనిషికీ తిండిపెట్టే పని శివుడిది. బట్ట కట్టుకునే పని వాళ్ళది. మనం నిమిత్తమాత్రులం. వాళ్ళ పనిలో మనం కాళ్ళూ వేళ్ళూ పెట్టరాదు.

పెడతామని ఓట్లు కూడగట్టుకోరాదు. మహాపాపం. జనానికి మోసం. దైవానికి ద్రోహం." ఆవేశంతో అతని స్వరం ఉపన్యాసరాగం అందుకుంది.

"శహబాష్! ఆగుమాగుము" అన్నారు గోరాలు.

శివదాసు ఆగేడు.

'శివదాసు' వాళ్ళ అమ్మా నాన్నా బియ్యంలో రాసిన పేరుకాదు. అది అతని కష్టార్జిత నామం. కుర్చీలో కూర్చోక ముందు అతను జనం ఆకలి కేకలకు శివరాగం కట్టేవాడు. 'భుక్తి కన్న భక్తి మిన్న.' 'ఈ లోకంలో గుడి కట్టు – ఆ లోకంలో అడుగెట్టు.'

'ఆకలి కోసం చస్తే ఏముంది – ఆ శివుడి కోసం చస్తే నేముంది. ఫేముంది. శైవేతర స్త్రీల అవయవాలనూ పురుషుల ఆస్తులనూ దక్కించుకునే స్కీముంది' వంటి నినాదాలకు శ్రీకారం చుట్టేవాడు. అలా శివదాసుగా పేరుకెక్కాడు. పాలనలో ఉన్న పార్టీ వారి శీల రాహిత్యాన్ని చూసి, చూసి విసిగిన జనాలు అతని శివ కీర్తి కన్న శీల కీర్తికి పడి కుర్చీ కెక్కించారు.

ఆగిన శివదాసు ముందు – సమ్మతి తయారీ సంస్థ – థీరీల చిట్టాను ఉంచారు గోళ గ్రామ సిద్ధాంతులు.

"ఇలా చూడు శివదాసూ! మా సిద్ధాంతుల తెలివి. 'భుక్తి కన్న భక్తి మిన్న.' అని మీరు తపస్సు చేసి తెలుసుకున్న విషయాన్నే వీళ్ళు తమ భుక్తి గడవటం కోసం రాసిపెట్టారు. దీనికి వీళ్ళు పెట్టిన సాంకేతిక నామం 'నాగరికతల సంఘర్షణ'. 'క్లాష్ ఆఫ్ సివిలిజేషన్స్"- అన్నాడు గోరా చిట్టాలో ఓ పేజీ చూపిస్తూ.

"అంటే?"

"అదేంటయితే ఎందుకు శివదాసూ!" అన్నాడు ఓ గోవా టైమ్ చూసుకుంటూ.

"అవసరం లేనిది మీరెందుకు చెప్పుతున్నారు?" అడిగాడు శివదాసు.

గోరాల వైపు విసుగ్గా చూసారు గోవాలు.

"ఓపిక పట్టండి! క్యూ దేశాన్ని కూడగట్టుకుంటే ఆసియాని అరచేతిలో పెట్టుకున్నట్టే" అని సిద్ధాంతి వైపు చూసారు గోరాలు.

"అయ్యో! శివదాసు గారూ! గోవాలకి తెలిసినదొక్కటే! లాభం! దానికి కావలసిన థీరీలు తయారుచేసి పొట్ట పోసుకుంటాం మేం. ఈనాటి సంతీకరణ, సొంతీకరణ, గోలీకరణ వంటివన్నీ మా తయారీలే. ఒకప్పుడు గోవాలు ఆయుధాలు మాత్రం అమ్ముకు బతికేవారు. ఆ రోజుల్లో వీరి వ్యాపారాలు ఎక్కువ శాతం దేశాల ఏలికల ఒప్పందాల మధ్య సాగేవి. ఇరుగు పొరుగు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు రాజేసి, దేశం లోపల ఉగ్రవాదులను నాటి, ఆయుధాల పోటీలో పరుగెత్తించటం గోరాల పని. ఆయుధాలు అందించటం గోవాల పని. అప్పటి ప్రపంచాన్ని మూడుగా మేం విడదీసేం. కాపిటలిస్ట్ దేశాలని మొదటి ప్రపం

చం. కమ్యూనిస్ట్ దేశాలది రెండో ప్రపంచమన్నాం. మిగిలిన దరిద్రగొట్టు దేశాలు మూడో ప్రపంచం. అందువల్ల ఆ రోజుల్లో మూడో ప్రపంచ దేశాల ప్రభుత్వాలకు కాస్తంత పవరు ఉండటమే మా గోళ పెత్తందారులకు పతనుగా ఉండేది. –"

"అవన్నీ ఎందుకండీ శివదాసు గారికి చెప్పి బోరు కొడతారూ?" గోవా విసుగు.

"అయ్యా! మీ ఉప్పుతిని బతికే సిద్ధాంత ఉద్యోగులం. మార్క్సు మహనీయుడు ఏ డబ్బులూ పుచ్చుకోకుండా శ్రమపడి ఒక్క సిద్ధాంతం తయారుచేసి, శతాబ్దాలుగా మీరు కట్టుకున్న సౌధాల పునాదులు ఎక్కదీసేసరికి బిత్తరపోయి విశ్వవిద్యాలయాలను సిద్ధాంతాల ఉత్పత్తుల సంస్థలుగా మార్చి ఆ ఉత్పత్తులలో తమకు లాభమిచ్చే వాటికి ఇన్సెంటివ్‌లను ఇచ్చి, నష్టం వచ్చే వాటిని కాగితాలకు పరిమితం చేసి వాటికి విరుగుడు మందులు ముందే సిద్ధం చేసుకునే గోళ పెత్తందారులూ! ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీ డబ్బే పుచ్చుకుని సిద్ధాంతాలు తయారుచేసి పెట్టడానికైనా కొంత బుర్ర ఉండాలి. బుర్ర ఉన్నోడికి తప్పనిసరిగా ఉండేది జ్ఞానాహంకారం. దాన్ని హేండిల్ చేసేటపుడు తమరు జాగ్రత్త వహించాలి."

ఆ మహావాక్యం పలికేటపుడు కూడా తమ ఆవేశం పూర్తిగా బయట పడకుండా ఉంచుకునేందుకు ఆయన పడిన శ్రమగమనించి తృప్తిపడిన గోవా అపాలజటిక్‌గా నవ్వాడు.

"అయ్యా! మీ జ్ఞానమే మాకు మూలధనం. మీరే మాకు మూలవిరాట్టులు. అటువంటి మీరు మాటలాడేటపుడు మేం కలగజేసుకుంటామా? శివదాసు గారికి అంత వివరించటం కాస్తంత ఆశ్చర్యంగా తోచి... మధ్యలో ప్రశ్నించాము.."

"ఎందుకూ అంటే తగిన కారణం ఉంది."

శివదాసు ఎదురుగా మాటలాడవచ్చా అన్న సందేహాన్ని చూపులతోనే తీరుస్తూ కొనసాగించాడు సిద్ధాంతి.

"వారు శివదాసు. వారిది క్యూ దేశం. ఆ దేశానికి ఆ పేరు వాడిన మన తెల్లవాళ్ళు ఎందుకు వాడారో తెలుసా? అది అత్యంత పురాతన దేశం. ప్రపంచ నాగరికతలలోనే ఓ విచిత్రమైన నాగరికత వారిది. దోపిడీ చేసే వాడి మీద కించిత్తు ద్వేషం కలగకుండా శతాబ్దాలు మనగలిగిన వర్ణ వ్యవస్థను సృష్టించుకున్న నాగరికత వారిది. ఒకపక్క సర్వసంగ పరిత్యాగుల ముందు సమస్తమూ ధారపోయగల మహరాజుల క్యూ. మరోపక్క సంపాదననంతా ప్రజల కోసం వెచ్చించగల వ్యాపారుల క్యూ. కొట్టి, చంపి మనుషలను బానిసలుగా చేస్తే మనం నిర్మించగలిగిన మహా నిర్మాణాలను దైవం పేరిట నిర్మించటానికి మనుషలను తమంత తాము సిద్ధమయేట్టు చేసిన మేధావుల క్యూ. ఒకప్పుడు తినే జనం కోసం ఫలాలతో వృక్షాల క్యూ. అన్నింటికన్న ముఖ్యంగా ప్రశ్నల – దేశం. వారిది కంట్రీ ఆఫ్ క్వశ్చన్స్. గురు శిష్య క్వశ్చన్ సంప్రదాయంతో జ్ఞానానికి అవధులు ముట్టుకున్న దేశం."

శివదాసు అనుమానంగా చూసాడు. "మీరు మమ్మలని పొగుడుతున్నట్టేనా?"

"తమరికి ఆ అనుమానం రావటం తగదు."

"ఎందుకూ అంటే - కంట్రీ ఆఫ్ క్వెక్జోటిస్ అని మీవంటి దొరలు అంటూంటారని మా దేశపు మేధావులు చెపుతుంటారు. మేం తిండి కోసం, పని కోసం, అప్పుల కోసం, పొగడ్తల కోసం, గుర్తింపు కోసం - మీ ముందు క్యూ కడతామని..."

"ఇంత గ్రహణశక్తి గల మిమ్మలని ఎవరైనా ఏదో జోకేసినంత మాత్రాన నిజం అయిపోతుందా శివదాసుగారూ! మీ ముందు ఏలికల కల్లబొల్లి సెంట్రలిజంతో, నానెలైన్మెంట్ కబురులాడుతూ, సోషలిజం స్లోగన్లతో ఓట్లు వండుకుని, ప్లాన్డ్ ఎకానమీకి ప్రణాళికలు వేస్తూ, దేశవాళీ ఇండస్ట్రీకి పాదపూజలు చేస్తూంటే మండి అలాంటి జోకులు వేసుకునేవాళ్లం - అంతే! - రామాయణంలో పిడకల వేట వదిలి, విషయానికి వద్దాం. అలా ప్రభుత్వాలకు పవరు ఉండటం పనికొచ్చిన రోజులలో మీ వంటి అంతగా ఎదగని దేశాలలో భార, భారీ పరిశ్రమలు పబ్లిక్‌లో ఉండేవి. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడికి పదేళ్ళకి గాని ఫలితాలు తెలిసేవి గావు. చిన్నా చిదరా పరిశ్రమలు ప్రైవేట్లో ఉండేవి. మీ ఎర్ర నాయకులు పబ్లిక్ కార్మికుల జీతభత్యాల పెంపుదలకి; ఎర్రి కార్యకర్తలు ప్రైవేట్ పారిశ్రామికులతో సమ్మెలకి; ఎర్ర మరియు ఎర్రి మేధావులు గతమంతా యుద్ధ ప్రాతిపదికను నిరాకరించటమూ, ప్రతిదానినీ - విలను చచ్చును, హీరో విజయించును - ధోరణిలో రేషనలైజ్ చేసుకోవటానికి లిమిటై పోయేవారు. తమవంటి అసలు సిసలు నాయకులు, కార్యకర్తలు, మేధావులు బాక్‌డ్రాప్‌లో ఉండిపోయే మీ శివభక్తికీ, గత కీర్తనలకీ ఫాసిజంలాంటి టాగ్‌లు తగిలిస్తూంటే- ప్రజాస్వామ్యానికి కొండగుర్తుగా ఎన్నికలను నమ్మే మాబోటి వాళ్ళం ఎప్పటికైనా మీరు కుర్చీ ఎక్కుతారన్న ఆశతో ఎదురు చూసేవాళ్ళం."

"ఏదో! ఆ శివుడి మహిమ. మనలో ఏముంది?"

"ఇక్కడ శివుడూ లేడు. జనమూ లేరు. నిజం మాటలాడుకుందాం."

"చిత్తం. చెప్పండి."

"మీరు జ్ఞానులు కనకనే మీకు ఇంత వివరించాం. అప్పటిలో ప్రభుత్వాలకు అంత పవరుండటం వల్లనే తమ దేశం హద్దుల్లో ప్రభుత్వ రక్షిత మార్కెట్లలో పెరిగిన ప్రైవేట్ పారిశ్రామికులే ఆ దేశపు పబ్లిక్ భార, భారీ పరిశ్రమలను కొనేయగలిగినంతగా ఎదిగారు. అలా ఎదిగిన దేశవాళీ పరిశ్రమలను టేకోవర్ చేసుకొని ప్రపంచాన్ని మరింత ఏకం చేయాలని ఈనాడు ఈ గోళ వ్యాపారుల పూనిక. ఒకప్పుడు ఆయుధాలు మాత్రం అమ్ముకు బతికిన వీరికి - ఇతరాలు కూడా అమ్ముకు బతకాలన్న నేటి పూనికకు ఈనాడు ప్రభుత్వా లకు అంతగా పవరు ఉండటం తగదు. ప్రపంచాన్ని ఒక్కటి చేసి, పోస్ట్ మాడరన్ మానవు డిని

సృష్టించి వాడిని మృత్యుంజయుడిని చేసి, ఇతర గ్రహాలకు అధిపతిని చేసే వీరి లక్ష్యంకి – ప్రభుత్వాలు తమ దేశ పరిశ్రమల రక్షణ, ప్రజల సంక్షేమం వంటి మొహమాటా లకు పోయి అడ్డంపడ్డం మంచిది కాదుగదా!"

"మనిషి మృత్యుంజయుడు కావాలనుకోటం శివ ధిక్కారం."

గోరాలు మొహమొహాలు చూసుకున్నారు. ఆ మీదట సిద్ధాంతి ముహంలోకి అసహ నంగా చూసారు. ఏం ఫరవాలేదన్నట్లు చూసి, అన్నాడా సిద్ధాంతి.

"అందుకే చెప్పాను వీరిది భౌతిక పూనిక. వీరి సంకల్పం ఒక విధంగా మీ శివుని సంకల్పమే!"

"అదెలా?"

"మేం విన్నంతవరకూ మీ శివుడు లయకారకుడు. వీరిదీ అదే పని. ఒక్క మనిషిని మృత్యుంజయుడిని చేయటానికి, ఒక్కడిని ఇతర గ్రహాలకు పంపటమనే మహోన్నత లక్ష్యం కోసం కోట్లాది జనాన్ని నిత్యం లయించటం మీ శివుడికి ప్రతికూలమా?"

ఆలోచనలో పడ్డాడు శివదాసు.

"కనక శివదాసుగారూ! మీరు చేయదలచుకున్నదీ వీరు చేస్తున్నదీ బాహిర దృష్టికి వేరు కానీ, స్థూల దృష్టికి ఒక్కటే!"

ఆలోచనలో మునిగిపోయాడు శివదాసు.

"విష్ణుస్థాన్ వాళ్ళతో కూడా మీరు ఇలాగే అని ఉంటారు. వాళ్ళు మా వందలాది శివాల యాలను పడగొట్టితే మీరు ఖండించలేదు. మా శివజన్మ స్థానంలో ఓ గుడి కట్టుకోటానికి మాత్రం వద్దని మంతనాలు" అన్నాడు శివదాసు.

"అయ్యో! అవన్నీ మీ ద్వైపాక్షిక విషయాలుగానూ, ఆంతరంగిక సమస్యలుగానూ మీకు వదిలేయమని మా గోరాల చేత అనిపిస్తూనే ఉన్నాంగదా!"

"అవుననుకోండి. కాని"

"కానీ అర్ధణాలు వదిలేయండి దాసుగారూ! ఇహనిప్పుడు మీ శాశ్వత లక్ష్యం గుడి కడతాననడమే! దానికోసం చేయాల్సినది మాత్రం అప్పులు."

"చిత్తం! అప్పులే!" గోళ పెత్తందారులు కోరస్‌గా అన్నారు.

"గుడి కట్టేపాటి ధనం మా వద్ద ఉంది" శివదాసు కోపంగా అన్నాడు.

"ఎంతమాట! ఎంతమాట! గుడికి అప్పు చేయవలసిన స్థితి మీకా? ఛఛ! మా అభిప్రాయం అది కానేకాదు."

"మరింకేమిటి?"

"చెప్తాం. గుడి కట్టడం- కుర్చీని శాశ్వతం చేసుకోడం - ఈ రెంటిలో ఏది ప్రధానం?"

శివదాసు నోరు విప్పకముందే సిద్ధాంతి అర్థవంతంగా నవ్వాడు.

"ఆవేశం కాదు, ఆలోచించండి. గుడా? కుర్చీయా?"

"నా మటుక్కు నాకు గుడే కాని - మా పార్టీ వాళ్ళకు... ఏమో! వీటికీ మీ అప్పుల ప్రస్తావనకీ సంబంధం ఏమిటి?"

"మీ మైనారిటీ వైష్ణవులని తన్నో, కొనేసో ఒప్పిస్తారు. గుడి కడతారు"

"వాళ్ళంత సులువుగా ఒప్పుకోరు"

"ఒప్పుకోరు. నిజమే! మాటవరసకి అన్నాం. గుడి కడతారు. ఆ తరవాత?"

"ప్రజలకి..."

"భక్తి కుదురుతుంది. ముక్తి దొరుకుతుంది. నిజమే! మీ మాటేమిటి?"

"..."

"ఈ కలికాలంలో ప్రజలకి కృతజ్ఞత ఉంటుందా? కుర్చీ శాశ్వతం చేస్తారా?"

"ఇంకో గుడి కడతాం"

"ఇంకో లక్ష మందిని చంపి. ఆ తరువాత?"

"????"

"సరే! ఏదోలా ఓటర్లను తిప్పుకుంటారు. వచ్చి ఓటేస్తారా? తెచ్చి ఓటేయించాలా? మీరు కట్టిన గుడుల గూర్చి, కట్టబోయే గుడుల గూర్చి ప్రచారం చేయాలి. అందుకు ఫోర్త్ ఎస్టేట్‌ని సొంతమైనా చేసుకోవాలి లేదా కిరాయికైనా పుచ్చుకోవాలి. ఓటర్లకి ఋణమో, ఫలమో ఇచ్చుకోవాలి. కన్న బిడ్డలైనా కాళ్ళకింద కొమ్మలు నరికేసే రోజుల్లో మన జండా కింద గెలిచినవాళ్ళు మనతో ఉంటారని గ్యారంటీలేదు. వాళ్ళని ఎప్పుడూ తడుపుతూ ఉం డాలి. అయిదేళ్ళ పాటు సరిపడినంత మందిని పోషించటం మాటలతో అవదు. ఈలోగా నీ గూటిలో వాళ్ళే నీకు ఎసరు పెట్టకుండా కాసుకోవాలి. నీ కుర్చీ నీకే ఉండి పోవాలంటే అదంత ఆషామాషీ వ్యవహారం కాదు. దీనికంతకీ సొమ్ము ఎలా వస్తుంది? చంపటానికి జనం కుప్పలు తెప్పలుగా దొరుకుతారు. పంచటానికి ధనం?"

"..."

"కనక మీరు అప్పులు చేయక తప్పదు"

"ఎవడిస్తాడు? ఏం చూసిస్తాడు?"

"మేం యిప్పిస్తాం" అంటూ పక్కనున్న విశ్వబాంకుని చూపించారు గోళగ్రామ పెత్తం దార్లు.

"నేనెలా తీరుస్తాను. ఏముందని తీరుస్తాను?"

"నిన్నెవడు తీర్చమన్నాడు!"

"నా పార్టీ మాత్రం ఎలా తీర్చగలదు?"

"నీ పార్టీని మాత్రం తీర్చమని ఎవడడుగుతాడు??"

"మరింకెవడు తీరుస్తాడు?"

"దేశం" అన్నాడు గోరా.

"దేశం తరఫున చేసే అప్పులు దేశమే తీరుస్తుంది. తీర్చాలి. అదీ న్యాయం. అదీ ధర్మం" అన్నాడు గోవా.

"నాకంతా అగమ్య గోచరంగా ఉంది."

గో(గ్రా పెత్తందారులు అయోమయంగా సిద్ధాంతి వైపు చూసారు.

"చెప్పానుగదా వారిది జ్ఞానదేశం. ప్రశ్నల దేశం" అంటూ నవ్వి శివదాసుని మెచ్చు కోలుగా చూసాడు.

"అయ్యా శివదాసు గారూ! ఎన్నికల ఖర్చుకి మూటలు కావాలిగదా?"

"కావాలి"

"కుర్చీ ఎక్కాక, అది కదలకుండా ఉండటానికి ధనం దట్టించాలి గదా?"

"చెప్పిందే ఎందుకు చెప్పి చికాకు పెడతారు?" నసిగాడు శివదాసు.

ఏమీ పట్టించుకోకుండా కొనసాగించాడు సిద్ధాంతి.

"దేశం పేరిట అప్పులు చేయండి. అందులో మీ వాటా మీరు తీసుకోండి. అది మీలో మీరు ఎలా పంచుకోవాలో మా కన్సల్టింగ్ కంపెనీలు పాకేజీలు తయారు చేసి పెడతాయి. అప్పులు ఎందుకు చేసారని మిమ్మలని ఎవడూ నిలదీసి అడగరు. ఎందుకంటే మీ ముందు వాళ్లు చేసిందీ, మీరూ మీ తరవాత వాళ్ళు చేయబోయేవీ అప్పులే! సెంటరోళ్ళవనీండి, మీలా రైటోళ్ళవనీండి, చివరాకరికి ఎర్రోళ్ళవనీండి ఎవరు చేసేదైనా అప్పులే! కుర్చీ ఎక్కిన అందరి ఎజండా ఒక్కటే!"

"నా తరువాత వాళ్ళా!"

"శివదాసుగారూ! మీరేం నియంతలు కాదు గదా శాశ్వతంగా ఉండిపోటానికి! మీది ఎన్నికల దేశం. అయిదేళ్ళ తరువాత మీరు రారు."

"ఆ మాత్రానికి.."

"వచ్చాక అయిదేళ్ళుండాలి గదా? పోయాక, మళ్లీ అయిదేళ్ల వరకూ గుళ్ళు కదతామని జనాన్ని చంపుతూ లైమ్‌లైట్‌లో ఉండాలిగదా? కుర్చీలో ఉన్నాళ్ళని తిడుతూ గడపాలిగదా?

అప్పుడేగదా మీరు మళ్ళీ కుర్చీ ఎక్కుతారు? దీనికంతకీ ధనం కావాలి గదా? ఎక్కడనించి ఎలా వస్తుంది?"

"ఇదంతా అవినీతి" గొణుక్కున్నాడు శివదాసు.

"కాదు. ఇది రాజధర్మం. అవినీతి అనేదానికి మీకు ఆలోచించే శ్రమ లేకుండా మేమే నిర్వచనం తయారు చేసి పెడతాం. దానికి కొలమానం కూడా మా అవినీతి ఇండెక్స్ కంపెనీలు సిద్ధం చేస్తాయి. అవి అవినీతి తగ్గించే పాకేజీలు కూడా ఇస్తాయి. ఉదాహరణకి మీ రైల్వేల్లో రిజర్వేషన్ పద్ధతిని కంప్యూటరైజ్ చేయటం వల్ల, తత్కాల్ స్కీముల వల్ల ఎంత లాభం పెరిగింది - ఎంత అవినీతి తరిగింది. కంప్యూటర్లు అమ్ముకుని మేం పదిరాళ్ళు పోగేసుకున్నాం. అది వేరే విషయం. కనక నీతి అవినీతి గొడవలతో తల పాడుచేసుకోకు. అప్పులలో మీ వాటా అంటే ముడుపులనో, మరేదనో అనుకోకు. రోడ్లు వేయటానికి కాంట్రాక్ట్ ఎవరికో ఒకరికి యివ్వాలిగదా! అది మీ వాళ్ళకే యిస్తే నీ పట్ల కృతజ్ఞులై పడుంటారు. నీ ఎన్నికల హుండీలో కాయో, కూరాకో వేస్తారు. ఇది అసలు సిసలైన ప్రజాస్వామ్య ధర్మం. యల్‌వన్ కాదని మీ వాడికి ఇస్తే అది అవినీతి. కొటేషన్లు పిలిచేటపుడే మీ వాడికి అనుకూలంగా టెండర్లు తయారు చేయించేవనుకో - అది నీతి. మీ వాడు ఓ హోటల్లో సర్వర్‌గా పనిచేసాడు. ఆ మీదట ఓ టూరిస్ట్ బస్ కొన్నాడు. మూడు ఇళ్ళు కట్టాడు. వాడు వైష్ణవాగ్రహారంలో ఓ ఏభై మందిని పెద్ద ఖర్చు లేకుండా నూతిలో తోసి, దానికి కరెంట్ పెట్టి చంపేసాడనుకో!"

"ఛఛ! మా వాళ్ళెవరూ అలా చంపలేదు" అన్నాడు శివదాసు కంగారుగా.

"మళ్ళీ మీరు భుజాలు తడుముకుంటున్నారు. ఇక్కడకి దగ్గరలో మానవ హక్కుల వాళ్ళెవరూ లేరు. ఆలాంటి పొదుపరి వీరుడు వస్తాడు. ఏదో బతుకుదెరువు చూపించమంటాడు. వాటికి కాంట్రాక్ట్ ఇవ్వాలి. అప్పుడే మా విశ్వబాంకు వాళ్ళు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి రోడ్డేసుకోటానికి ఓ వంద కోట్లు ఇచ్చారనుకో! ఆ కాంట్రాక్ట్ మన వీరుడికి ఇవ్వటానికి నిశ్చయించుకున్నావు. అప్పుడా టెండర్‌కి బిడ్స్ వేయాలంటే టూరిజంలో, హోటలిండస్ట్రీలో, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో అనుభవం కావాలంటావు. మన వీరుడికే కాంట్రాక్ట్ వస్తుంది. ఇందులో అవినీతి ఏముంది?"

శివదాసు తలాడించాడు. "అప్పులు తప్పవన్న మాట. మా ముందున్న సెంటరోళ్ళని దేశాన్ని తాకట్టు పెట్టేస్తున్నారని అనవసరంగా తిట్టాం."

"ఇప్పుడూ తిట్టవచ్చు. తిట్టాలి. అది అపోజిషన్ ఎజండా. ఎకనామిక్స్ వరకూ అందరికీ ఒకటే ఎజండా. కుర్చీ ఎక్కి అప్పులు తీసుకోటం, దిగి తిట్టటం. ఓట్లు నొల్లుకుందుకు మాత్రం ఎవరి ఎజండా వాళ్ళది."

"ఇంతకీ మీ..రు.. అప్పులెందుకు ఇస్తామంటున్నారు?" అడిగితే ఎక్కడ ఇవ్వనంటారో నన్న భయం శివదాసు కంఠాన్ని అప్పుడే మెల్లగా చుట్టుకుంటోంది.

"అభివృద్ధి కోసం"

"అంటే?"

"దానికి కూడా మా వద్ద నిర్వచనాలు అమ్మకానికి ఉన్నాయి. తూనిక రాళ్ళు ఉన్నాయి. అవన్నీ బయట మా షోరూంలో దొరుకుతాయి. ఇప్పటికే చాలా టైం వేస్ట్ చేసాం. బయట సలహాల కోసం, సాయాల కోసం చాలా దేశాధినేతల క్యూ ఉంది" అన్నాడు సిద్ధాంతి థీరీల చిట్టా మూసేస్తూ.

"చివ్వరి సందేహం!"

"ఒక్క ముక్కలో అడగండి"

"మా దేశానికి అభివృద్ధి ఏమిటి?"

"గుళ్ళు పెరగటం. గుళ్ళ ముందు కార్లు పెరగటం"

## 2

అప్పటినించి అప్పులు చేస్తూ, అప్పుల మీద వడ్డీలు కట్టటానికి అప్పులు చేస్తూ, విష్ణుస్థాన్ మీద, వైష్ణవుల మీదా ద్వేషాన్ని ఆరిపోకుండా మధ్య మధ్యలో ఎగసనదోస్తూ, ఐదేళ్ళ కుర్చీ కాలాన్ని పూర్తిచేసుకున్నాడు అప్పుదాసు.

ఆ రోజులలోనే అతను అప్పుదాసు అయాడు.

అతని పనులే ఆ పేరు ఆర్జించి పెట్టాయి. అతని పనులు కేవలం అప్పులు చేయటమే కాదు. వాటిమీద థీరీలు చేసి తన పేరుకి పేరు పెంచుకున్నాడు.

భగవంతుడు కూడా అప్పులు చేస్తాడని, వడ్డీలు కడతాడనీ అది మనం వారి నుంచే నేర్చుకున్నామని ఆయన అనేవాడు. అప్పులు ముదిరాక, భక్తీ ముదురుతుందని ఆయన పురాణాల నుంచి సోదాహరించాడు. అసలు కన్న వడ్డి ఎక్కువయాక, వడ్డీలు పుచ్చుకునే మనిషి దేముడయాడని, ఇచ్చుకునే భక్తుడయాడని, భక్తి వల్లనే ముక్తి దొరుకుతుందని థీరీలు తీసాడు. నువ్వు సొంతానికి ఎన్ని అప్పులైనా చెయ్యి! దేశం తరఫున చేసేటపుడు కాస్త వెనకా ముందూ ఆలోచించు - అన్నారు కొందరు అజ్ఞానులు. ఆయన వైరాగ్యం ఒంటబట్టిన నవ్వు నవ్వి, 'అజ్ఞానీ! ఒక దశ చేరాక సర్వం బ్రహ్మమే నోయి! దేశానికున్న దంతా నాదేననీ, నాకులేనిదంతా దేశానిదేననీ గ్రహించకపోతే నీవు ఎప్పటికీ బ్రహ్మాన్ని తెలుసుకోలేవు. స్వపరభేదం ఎందులోనూ పనికిరాదు. అప్పుల విషయంలో అసలు పనికిరాదు. గ్రహించుకో!'

నిజానికి–

అప్పుదాసుకి థీరీలు తియ్యటం కూడా రాదు. భాష్యాలు చెప్పటమే వచ్చు. అతని తాత ముత్తాతల కాలంలోనే సొంతంగా థీరీలు చెప్పకూడదని ఓ నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా ఏం చెప్పినా జనాలు వినరని, తెలివి మీగుతున్న జనం ఆలోచించవచ్చని, ఆలోచించి ఊరుకోక ప్రశ్నించవచ్చని వారు గ్రహించారు. కిందనున్న జనాలు ఆ పని చేసినా మానినా, – చెట్టు చచ్చేకాలానికి కుక్కమూతి పిందెలన్నట్లు పుట్టుకొస్తున్న – తమ పిల్లలే కొత్త ఆలోచనలు చేసి కిందనున్న వాళ్లని మీదకి లాగి, తమ కాళ్ళ కింద కొమ్మలని తామే నరుక్కుంటారని అనుమానం వచ్చింది. దానా దీనా జ్ఞానార్జనని వారసత్వంగా మార్చిన అప్పుదాసు తాత ముత్తాతలు కొత్త థీరీలు తియ్యకూడదని గట్టిగా కూడబలుక్కున్నారు. అన్నీ లోగడే ఆలోచించి పెట్టేసారని చెప్పారు. దాన్ని నమ్మించటం కోసం పాత గ్రంథాలను అపౌరుషేయాలన్నారు. ఆ మీదట ఎవరు ఏం చెప్పాలన్నా, పాత గ్రంథాలనే ప్రమాణంగా తీసుకోవాలన్నారు. మీ గ్రంథాలను మేమెందుకు ప్రమాణంగా స్వీకరించాలని ప్రశ్నించిన వాళ్లని వీలైతే మాటలతోనూ, వీలుకాకపోతే చేతులతోనూ దేశంనించి, వినకపోతే లోకం నుంచి తరిమేసారు. ఆ కాలం నుంచి, పాత గ్రంథాలకు కొత్త భాష్యాలు చెప్పటానికే జ్ఞానులు లిమిటై పోయారు. గతకాలమే మేలు వచ్చుకాలము కంటెన్ అయిపోయింది. సమకాలికులు మెచ్చరేగదా అని ఆలోచనాపరులు ఆలోచనలు మానుకోసాగారు. దానాదీనా భాష్యాలకే అప్పుదాసు తాతలు తలలు అప్పజెప్పేసారు.

ఆ కోవలోనే అప్పుదాసు పుట్టాడు.

పుట్టిన చాలా రోజుల వరకూ అప్పుదాసు ఎదగలేదు. అతని పార్టీ క్యూ దేశంలో ఏదో మూలన ఉండి, పాతగ్రంథాలనూ, వాటిమీద భాష్యాలనూ ఉదహరిస్తూ తమ దేశమే అత్యంత పురాతనమైనదనీ, లోకమంతా చీకటిలో మగ్గుతున్నపుడు తమ జ్ఞానప్రకాశంతో విశ్వతమస్సులను పారద్రోలామని, లోకం గుడ్డలు కట్టుకోని దశలో తాము బట్టలు నేసామని జనానికి చెప్పటంలో ఉండిపోయింది.

వాళ్లు అలాచెపుతూంటే ముసలివాళ్లు విని మరింత ముదుసలులయారు గాని, కుర్ర వాళ్లు మాత్రం అన్నం కావాలి గాని – అన్నమూ సున్నమూ ఒకటేననే వైరాగ్యం – అక్కరలేద న్నారు. అప్పుదాసు విస్తుపోయాడు. విసిగిపోయాడు. మూటాముల్లె సర్దుకుని అడవులకు పోయి, జనానికి ఆకలితోనేగాని జ్ఞానంతో పనిలేకుండా చేసిన భగవంతుడి ఆంతర్యం గ్రహించేందుకు తపస్సు చేసుకుందామనుకున్నాడు అప్పుదాసు.

సరిగ్గా అదే సమయంలో–

ఆకలే అసలు ఇస్యూ అని జనానికి సులువుగానే బోధపరిచిన ఎర్ర వాళ్లు దాన్ని ఎలా

తీర్చాలన్న దగ్గర చతికిల పడిపోయారు. అదెలాగూ తీర్చలేం కనక దాని పేరుమీద పెత్తన మైనా చేసుకుందామని కొందరూ, అలా చేయటం మోసమని కొందరూ తగువు లాడుకుని విడిపోయే గతితర్కంలో ఉన్నారు. ఈలోగా అటు దేముడినీ, ఇటు జనాన్నీ ఆకలితో ముడేసి, కడుపు నింపటమే మా ప్రణాళిక అంటూ కల్లబొల్లి కబుర్లతో కడుపు నింపిన వాళ్ళు అప్పటిదాకా పెత్తనం చేసారు. పెత్తనం మరిగి, పెత్తనానికి ఆకలితో అలమటించే వాళ్లే అసలు విత్తనాలుగా ఎరిగి, ఆ విత్తనాల నుంచి ఓట్లు పండించుకుని తినమరిగి– పెత్తనం చేసేసుకుంటున్న వాళ్ళని జనం భరించలేని స్థితి వచ్చింది.

ఆ సమయంలో–

పెత్తనంలో ఉన్నవాడి పెత్తనం ఊడగొట్టడమనే ఏకసూత్రంతో పెత్తనపు రుచి ఎరగని వాళ్ళంతా శమని తాము కట్టుకున్నారు. అందులో అప్పుదాసు కూడా ఒకడయాడు. 'కాలం కర్మం కలిసిరావటమందే ఇదే – అందుకే ఏదీ మన చేతులలో లేదు – అంతా శివుడి ఆజ్ఞ – పోదామనుకున్న వాడిని తంతే బూరెలబుట్టలో పడ్డట్టయింది' అనుకున్నాడు అప్పుదాసు. అట్లాగే భాష్యం చెప్పుకున్నాడు. పదవిలో ఏదో మూల ఉంటే జనానికి భక్తీ, ముక్తీ చెప్పుకుని శేషజీవితం గడిపేయొచ్చనుకున్నాడు. అలా అవలేదు.

పెత్తనమనేది ఓ పెద్ద మత్తు అన్న విషయం, ఎవరు ఏం చెప్పి అందులోకి వచ్చినా దాన్ని నిలబెట్టు కోవటం కోసం వాళ్ళు చెప్పినవాటితో సహా దేనినైనా వదిలేస్తారనే విషయం, పెత్తనం కాస్తంత భాయపడితే అందులో అసలు పెత్తనం గురించి ఒకరి నొకరు సందేహిం చుకుంటారనే విషయం అప్పుదాసు తలకెక్కింది.

పెత్తనంలోకి రావటమనే ఏకైక సూత్రం – వచ్చాక దాన్ని నిలబెట్టుకోటానికి – ఏమాత్రం పనికిరాకపోవటం గమనించాడు. రాజ్యాంతే నరకం ధృవం అన్న పాత మాటకి కొత్త భాష్యం చెప్పు కున్నాడు. ఎలాగూ నరకం తప్పనప్పుడు వ్రతం చెడ్డా పదవి దక్కాలనుకున్నాడు. ఎలాగైనా సొంతంగా పెత్తనం సంపాదించుకోవాలనుకున్నాడు.

అప్పుడు పెత్తనమనే గమ్యం చేరే రహదారి నిర్మాణానికి ముడిసరుకు ఏమిటా అని కుతర్కించుకున్నాడు.

అంతవరకూ పెత్తనం చేసినవాడు ఏం చేసాడు?

ఆకలే అసలిస్యూ అన్న థీరీని హైజాక్ చేసి, అది తీరుస్తామని ఐదేళ్లకోమారు చెప్పి, ముప్పయ్యేళ్ళు లాగించాడు. ఆకలికి మూలం అసమానతే అన్న సత్యం ఎరిగిన ఎర్రవాళ్ల కళ్లు మూసి జల్లకొట్టగలిగాడు. ఎలా? మూలమేదైనా ఆకలికి ఫలితం ఏమిటో వాడు పట్టేసాడు. అది ఆవేశం. దాన్ని కబుర్లతో చల్లార్చి ఓట్లుగా మార్చుకున్నాడు.

అంటే ఓట్లకి మూలం ఆవేశం.

ఆ ఆవేశాన్నే మనం మరో మార్గంలో ఒడిసి పట్టగలిగితే?!

ఆవేశాన్ని రగిలించగలిగితే?!

చాపుపుటకలు లేని శివుడు ఫలానా చోట పుట్టాడన్నాడు. ఆ చోట ఉండే అసలైన శివాలయం పడగొట్టి విష్ణ్వాలయం వైష్ణవులు కట్టారన్నాడు. దాంతో పని మొదలయింది. శైవులంతా ఏకం కావాలన్నాడు. శివ జన్మస్థాపన జరపాలన్నాడు. పని జరిగింది. రహదారి నిర్మాణానికి కొంత నెత్తురు దొరికింది. దానికి ఎలా భాష్యం చెప్పుకోవాలా అని మల్లగుల్లాలు పడుతూ పెత్తనం అందుకున్నాడు.

ఆ విధంగా కుర్చీ ఎక్కిన శివదాసు అప్పులు చేసి పార్టీ నడిపాడు. అప్పులకి వడ్డీలు కట్టలేక ఐదేళ్ళు నడుములు విరుచుకున్న జనాలు ఏదోలా వెళ్ళి ఓట్లేసి శివదాసుని అపో్పజిషన్‌లో పడేసారు.

కుర్చీదిగాక, అందులోకి ఎక్కినవాళ్ళు తెస్తూన్న అప్పులు తనైతే చేసి ఉండే వాడిని కాదని, తన సంస్కరణలు పక్కదోవ పట్టిస్తున్నారని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. మరో ఐదేళ్ళ తరువాత, అతని పేరు మీదనే ఓట్లు సంపాదించుకున్న అనుచరగణం సరిపడ్డ సంఖ్య ఉండటంతో అతన్ని నెట్టేసి అతని కన్న శివభక్తి జాస్తి అని పేరుబడ్డ మరొకరిని కుర్చీ ఎక్కించారు.

## 3

ఆ మీదట ఇరవై ఏళ్ళు గడిచాయి.

క్యూదేశం స్వతంత్రంగా ఉందో పరతంత్రంగా ఉందో చర్చనీయాంశం అయి పోయింది. ఎన్నికలలో నెగ్గి, కుర్చీ మీద కూర్చునే క్యూయాయులే సంతకాలు పెడుతున్నారు. కాగితాలు మాత్రం విశ్వబాంకు నిర్దేశాలతో, గోవాల ఆదేశాలతో 'ఆసియా దేశ వ్యవహారాల కంపెనీ క్యూ శాఖ' వాళ్ళే గుమస్తాలుగా వేసుకున్న క్యూయాయులతో తయారు చేయబడు తున్నాయి. మైకు నాయకుల ఉపన్యాసాలు కూడా వాళ్ళే ఫీజ్ తీసుకుని తయారు చేసి పెడుతున్నారు. దేశం జనాభాలో ముప్పై శాతం గోవాల రక్షణ సేవా సంస్థలలో కాంట్రాక్ట్ కూలీలుగా బతుకుతున్నారు. తిరగబడుతున్న పదో శాతం జనం నించి ఆస్తులను రక్షించి పెడుతున్నారు. రెండు శాతం గోవాలు ఇతర సేవా సంస్థలలో కాంట్రాక్ట్ ఎగ్జిక్యూటివ్‌లుగా బతుకుతున్నారు. వారిలో పెద్ద జీతగాళ్ళు వంచన, పీడన, దోపిడీ అనే మూడు పద్దులకింద తతిమ్మా జనం చేత పనిచేయించే పథకాల రచనలో బతుకుతున్నారు. చిన్న మరియు బుల్లి జీతగాళ్ళు ఆ పథకాల ఆచరణలో బతుకుతున్నారు. వ్యవసాయ భూములన్నీ కాంట్రాక్ట్ కింద గోవాల చేతుల్లో ఉన్నాయి. పవరున్న దేశాల వారి పర్యావరణ పరిరక్షణ కోసం వారి భూముల్లో పండించరాని పంటలతో క్యూ భూములు కళకళలాడుతున్నాయి.

దేశం ఇలా దుర్నిరీక్ష్యంగా ఉండగా–

శివదాసు ఉరఫ్ అప్పుదాసు తొంబై ఏళ్ళ వయసులో యింకా బతికే ఉన్నాడు. అతని వద్ద ఈనాడు ఓ చిన్న బంగ్లా, పాపం నీతిమంతుడన్న ఖ్యాతి, ఏభై ఏళ్ళ రాజకీయ జీవితంలో పదేళ్ళ పాటు దేశాన్ని దడదడలాడించి కూడా పది కంపెనీలో, పదవులో సంపాదించి పెట్టనందుకు తిట్టే సంతానం ఉంది. వైష్ణవ టెర్రరిస్టుల హిట్‌లిస్ట్‌లో నంబరు వన్‌గా ఓ వెలుగు వెలిగిన మనిషికి – గుండు దండగ అని లిస్ట్‌లోంచి పేరు తీసేసారని వార్తలు రావటంతో – సెక్యూరిటీ ఖర్చులు మిగులుతాయని ఔరసులు నిశ్చయించటంతో – కమాండో రక్షణ కూడా లేదు.

శివుడి పేరు చెప్పుకుని, శివదాసు శీలం పేరు చెప్పుకుని, పార్టీని బతికించుకుని కుర్చీలు, ఆ మీదట సొంతానికి ఆస్తులూ సంపాదించుకున్న సహచరులంతా గోవాలు ఏర్పాటు చేసిన 'మూడో ప్రపంచ రాజకీయ నిర్వాసితుల పునరావాస పథకం' కింద భూమి అడుగునా, అవతలా సురక్షిత స్థావరాలో తల దాచుకోటానికి వెళ్ళిపోయారు. పలకరించే వారు లేరు. నమ్మిన జనానికీ, నమ్ముకున్న శివునికీ న్యాయం చెయ్యలేక పోయానేమో నన్న చింతలో చిదికి పోతున్నాడు శివదాసు.

అలాంటి సమయంలో–

అందరూ మరిచిపోయిన శివజన్మస్థానం సంగతిని మీడియా పెను తుఫాన్‌లా జనంలో వదిలింది. దానికి ఇంకా గిరాకీ ఉందని ఓ గోవా సంస్థ సర్వే చేసి ఆ సమాచారాన్ని అమ్మింది. ఓ గోవా కంపెనీ వైష్ణవులకు దబ్బిచ్చి ఆ స్థలం కొని శివాలయ నిర్మాణం ఆరంభించింది. మరో గోవా ప్రచారం కాంట్రాక్ట్‌కి తీసుకుంది.

అప్పుదాసు ఉరఫ్ శివదాసుకి ఆ విషయం తెలిసినపుడు సంతోషం పట్టలేకపోయాడు. తనను సంప్రదిస్తారనుకున్నాడు. ఆ మీదట ఆహ్వాన సంఘంలో వేస్తారనుకున్నాడు. ప్రారంభోత్సవానికి ఆహ్వానమైనా వస్తుందనుకున్నాడు.

ఆలయ నిర్మాణపు ఐడియా అమ్మిన కంపెనీలోనే ఓ ఎగ్జిక్యూటివ్ శివదాసు మనవడు. అతనికి ఓ కాంప్లిమెంటరీ పాస్ దొరికింది. సిగ్గు విడిచి నోరు తెరిచి మనవడిని పాస్ యిమ్మని అడిగాడు. నీకేం కనిపిస్తుందా – చస్తుందా – ఇవ్వను పొమ్మన్నాడు. ఆహ్వాన సంఘంలో స్థానాన్ని, ఆహ్వా నాన్ని కొనుక్కోగల స్థోమత గల శివదాసు శిష్యులంతా సురక్షిత స్థావరాలలోంచి తరలి వచ్చారు. వారికి భద్రతను అమ్మే కంపెనీ షేర్ విలువ ఆకాశాన్ని అందుకుంది. వారిలో ఒక్కరైనా వచ్చి తీసుకెళ్ళకపోతారా అనుకున్నాడు.

శివదాసు అనుకున్నవేవీ అవలేదు.

చూసొచ్చిన మనవడు ఆలయ వైభవాన్ని వర్ణిస్తున్నాడు. సెంట్రలైజ్‌డ్ ఏసీట. టైలర్ మేడ్, కస్టమ్‌బిల్ట్ పూజలుట, అర్చనలుట, శివదర్శనానుభూతి అమ్మకాలట.

“పోనీ టికెట్ కొని పెట్టరా చూసొస్తాను.”

“ఏడాది వరకూ అడ్వాన్స్ బుకింగ్ అయిపోయాయి. అప్పటిదాకా నువ్వు బతికుంటే చూద్దాం.”

శివదాసు ధేభ్యం మొహంతో ఆ రాత్రి – అప్పటిదాకా బతికించి ఉంచమని – శివుడిని వేడుకున్నాడు.

బూడిద రాసుకు తిరిగే నన్ను వ్యాపారపు సరుకు చేసి ఇంకా కొనుక్కుందామను కుంటున్నావా! – అంటూ ఓ పోటు పొడిచాడు.

ఇరవై ఏళ్ళ తరవాత త్రిశూలంతో మరణం శీర్షికతో శివదాసు ఉరఫ్ అప్పదాసు పేరు మీడియాకి ఎక్కింది.

■

5892

(ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం – 17 జూన్ 2003)